ఇందిరమ్మ కాలనీలో సమస్యల తిష్ట

- అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ
- వెలగని వీధిలైట్లు, పెరిగిన తుప్పలు
- తాగునీటి కోసం టిన్ను వాటరే దిక్కు

ఏలూరు రూరల్: నగర కార్పొరేషన్‌లో విలీనమైనా తమ సమస్యలు తీరడం లేదని మాదేపల్లి రోడ్డు ఇందిరమ్మ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఈ కాలనీ సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం నగర కార్పొరేషన్‌లో విలీనమయ్యింది. అయినా ఇప్పటికీ ఇక్కడి అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కార్పొరేషన్ సిబ్బంది ఇక్కడ చెత్తను ఎప్పటికప్పుడు తరలించడకపోవడంతో కాలనీ పరిసరాలు చెత్తమయంగా తయారవుతున్నాయి. రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలగకపోవడం, విష పురుగులు సంచరిస్తుండడంతో మహిళలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా అభివృద్ధి చేయకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీంతో దోమలు విజృంభించి కాలనీవాసులు తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఇక్కడి పేదలకు సురక్షిత తాగునీరు అందడం లేదు. కొన్నేళ్లుగా అధికారులు బోర్ల ద్వారా శుద్ధ నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నీటితో కనీసం అన్నం కూడా వండుకోలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. బోరు నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక ప్రతి కుటుంబం రోజుకు కనీసం రూ.20 ఖర్చు చేసి రెండు టిన్నులు నీళ్లు కొనుక్కుంటున్నామని వాపోతున్నారు. గోదావరి నీటిని కాలనీప్రజలకు సైతం అందిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి ఎన్నికల్లో ఇచ్చిన హామీ సైతం నేటికీ కార్యరూపం దాల్చలేదు.

పెరిగిపోతున్న పిచ్చి మొక్కలు

కనీస వసతులు లేక అనేక మంది లబ్ధిదారులు ఇళ్లు వదిలి, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఫలితంగా కాలనీలో పలు ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో వర్షాకాలంలో ఇళ్లలోకి పాములు, విష పురుగులు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో భయం భయంగా సంచరించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య పెరిగిపోతున్న పిచ్చిమొక్కలు, చెదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి

ఈ కాలనీలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. లక్షల రూపాయలు వెచ్చించి ప్రధాన బీటీ రోడ్డు సైతం నిర్మించారు. దీంతో ప్రజలు కాలనీలోకి రాకపోకలు సాఫీగా సాగిస్తున్నారు. దీనికి తోడు పలు వీధుల్లో సీసీరోడ్లు సైతం నిర్మించారు. ఇక్కడ స్థానిక ప్రజల కోసం సచివాలయం, వైఎస్సార్ క్లినిక్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఒక్కపైసా అభివృద్ధి పనులు కాలనీలో జరగలేదని నివాసితులు చెబుతున్నారు.


నివాసాల మధ్య పిచ్చిమొక్కలతో శిథిలమవుతున్న ఇళ్లు


వర్షం వస్తే ఈ రోడ్డు బురదమయమే..


డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇంటి పరిసరాల్లో నిలిచిన మురుగునీరు


వైఎస్సార్ సీపీ హయాంలో కాలనీకి వేసిన బీటీ రోడ్డు

సురక్షిత తాగునీరు అందించాలి

కాలనీలో సరఫరా అవుతున్న శుద్ధ నీరు తాగి కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అందుకే ప్రతిరోజూ కోటదిబ్బ ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాను. కొన్ని కుటుంబాల ప్రజలు రోజుకు రూ.20 ఖర్చు చేసి తాగునీరు కొంటున్నారు. కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలి.

లక్ష్మణరావు, కాలనీ నివాసి

డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

వర్షాకాలంలో కాలనీ బురద బురదగా మారిపోతోంది. మురుగునీరు, వర్షపునీరు కిందకు పారడం లేదు. ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీని వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైయినేజీ వ్యవస్థ బాగు చేయకుంటే మిగిలిన కుటుంబాలు సైతం బయటకు వెళ్లిపోతాయి.

– రాంబాబు, కాలనీ నివాసి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు


పవర్‌పేట శివాలయంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్తీక మాసం రెండో రోజున నగరంలోని పలు శైవ క్షేత్రాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆయా ఆలయాల్లో స్వామి వార్లకు విశేష రుద్రాభిషేకాలు జరిపారు. మహిళలు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. కాగా తొలి కార్తీక సోమవారం సందర్భంగా విశేష పూజలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

8 మంది జూదరుల అరెస్ట్

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో రూ.4,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

40 మద్యం సీసాల పట్టివేత

ఉంగుటూరు: ఎ.గోకవరం గ్రామంలో అక్రమంగా 40 క్వార్టరు మద్యం సీసాలు తరలిస్తున్న మారిశెట్టి శ్రీనుని అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ ఆదివారం తెలిపారు. గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి శ్రీనుని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై వివరించారు.

దివ్యాంగులకు సాయం

భీమడోలు: ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఆదర్శవంతంగా జీవించాలని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. భీమవరానికి చెందిన కూచిపూడి నెహ్రూ రాజా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజా ఆర్థిక సాయంతో దివ్యాంగులకు బియ్యం, పండ్లు అందజేశారు. గుండుగొలనుకి చెందిన కంకటాల కామరాజు ఆర్థిక సాయంతో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య పరీక్షలు

బుట్టాయగూడెం: మండలంలోని చీమలవారిగూడెంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (పిఠాపురం) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మాకల సత్యనారాయణ, వంగర రేణుకా దేవి సుమారు 100 మందికి పైగా ఆక్యుపంక్చర్ చికిత్స చేసి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ కార్యకర్త కరుణప్రసాద్, ట్రస్ట్ కార్యకర్తలు రామరాజు, శశి, ఉమేష్, రమ, పైడిపరు దుర్గ, కట్టా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడులు

కొయ్యలగూడెం: కోడిపందేలు నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వి చంద్రశేఖర్ ఆదివారం పేర్కొన్నారు. రాజవరం పంచాయతీ గంగవరం సమీపంలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.61 వేల నగదు, ఆరు మోటార్ సైకిళ్లు, మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

'పది' పరీక్షలు తెలుగు మాధ్యమంలో రాసే అవకాశం కల్పించాలి

ఏలూరు (టూటౌన్): వచ్చే మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు మాధ్యమంలో కూడా పరీక్షలు రాసుకునే అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలోనూ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆన్‌లైన్ పనుల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు తక్షణమే రూపొందించాలని డీఈఓని మరోసారి సంఘ తరఫున కోరతామని తెలిపారు.

ఫిషర్‌మెన్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలో శ్రీ సీతారామాంజనేయ ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు కలెక్టర్ ఆదేశాలు మేరకు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 113 మంది సభ్యులు పాల్గొన్నారు. ఇందులో బంటుమిల్లి బాలకృష్ణను అధ్యక్షుడిగా, మల్లుబోయిన వెంకటేశ్వరరావును ఉపాధ్యక్షుడిగా, మాంద్రు వెంకటేశ్వరరావును కార్యదర్శిగా, అలాగే మరో 6 గురిని డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ అప్‌లాండ్ ఏరియాలో అతిపెద్ద సంఘంగా శ్రీ సీతారామాంజనేయ ఫిషర్ సొసైటీ ఉందని, దీన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక నాయకులు, అధికారుల సహాయంతో సొసైటీ సమావేశ భవనం, వలలు, మత్స్యకార వృద్ధాప్య పెన్షన్లు, వాహనాలు, సొసైటీ అభివృద్ధికి రావాల్సిన అన్ని రాయితీలు అందేలా చేస్తానని తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన ఎలక్షన్ అధికారి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.భవిత, సిబ్బందికి, అలాగే ఎస్సై సుధీర్, సిబ్బందికి సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

22న మాదిగల ఆత్మీయ సమ్మేళనం


సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 22న ఏలూరులో నిర్వహించనున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఈమేరకు ఆదివారం ఏలూరు ఇశ్రాయేలు పేటలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఎలాంటి ఉద్యోగ నియామకాలు, ప్రకటనలు చేపట్టరాదని, ఎస్సీ వర్గీకరణ వేగంగా అమలు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'హైందవ శంఖారావం' కరపత్రం ఆవిష్కరణ


హైందవ శంఖారావం బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలనే డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్రరాజు వేణుగోపాల్ రాజు కోరారు. స్థానిక గ్రాండ్ కృష్ణ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం జిల్లా సన్నాహక సమావేశంలో బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి శ్రీ యాజ్ఞ వల్క్య రాజాశ్రమాధిపతులు కృష్ణచరణానందభారతీ స్వామి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర విధినిధి ప్రముఖ్ కస్తూరి సూర్య ప్రకాష్, ఏలూరు జిల్లా సంఘచాలక్ గద్ద మనుగు సత్యనారాయణ, వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇతర మత దేవాలయాలపై లేని ప్రభుత్వ పెత్తనం హిందూ ఆలయాలపై తగదని అన్నారు.

కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


విద్యార్థులతో కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ కే వెట్రిసెల్వి చెప్పారు. ఆదివారం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలను ఆమె ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. కళాశాల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి అనంతరం వారికి అవసరమైన సౌకర్యాలను ప్రిన్సిపల్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ త్వరతిగతిన భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఆర్డీఓ అచ్యుత అంబరీష్, తహసీల్దార్ బి.సుమతి, ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు ఉన్నారు.

ఇన్‌చార్జుల స్థానాలను భర్తీ చేయాలి

దెందులూరు: ప్రభుత్వ శాఖల్లోని వివిధ పోస్టుల్లో ఇన్‌చార్జిలు కొనసాగడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సత్వర సేవలు అందడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దెందులూరు మండలంలో వివిధ పోస్టుల్లో ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలలు పూర్తయినప్పటికీ చాలా పోస్టుల్లో ఇంకా ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. సివిల్ సప్లయ్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్, మండల వ్యవసాయ శాఖాధికారి, మండల పంచాయతీ విస్తరణ అధికారి, మండల మత్స్యశాఖ అధికారి, బాలసదనం సూపరింటెండ్, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్, దెందులూరు గ్రామ కార్యదర్శి, కొవ్వలి గ్రామ కార్యదర్శి, కొత్తగూడెం గ్రామ కార్యదర్శి, పోతునూరు వీఆర్వో -2, కొవ్వలి వీఆర్వో -1, దెందులూరు వీఆర్వో -3, శ్రీరామవరం వీఆర్వో, రామారావుగూడెం వీఆర్వో, జోగన్నపాలెం వీఆర్వో, దెందులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పీహెచ్‌సీలు, ఏఎన్‌ఎంల పోస్టులు ఎంతోకాలంగా ఖాళీగా ఉన్నాయి. వారి స్థానాల్లో ఇన్‌చార్జులు నియమించి వారితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రజలకు, ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పోస్టుల పని భారంతో న్యాయం చేయలేకపోతున్నామని ఉద్యోగులు అంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో ఉద్యోగులను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు. ఈ బాధలు భరించలేక కొంత మంది ఉద్యోగులు సెలువులు పెడుతున్నారు. కీలకమైన ఉద్యోగాల్లోనూ ఇన్‌చార్జులను నియమిస్తే ప్రభుత్వపరంగా ఆ శాఖలకు సంబంధించి విధి నిర్వహణ ఎలా కొనసాగుతుందని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ, ప్రదర్శన చేస్తున్న శాకాహారప్రియులు

భీమడోలు: ప్రపంచ శాఖాహార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పిరిమిడ్ సేవాదళ్ మండల అధ్యక్షుడు అప్పన్న ఆధ్వర్యంలో శాఖాహార ప్రియులు, పిరిమిడ్ సేవాదళ్ సభ్యులు భారీ సంఖ్యలో ర్యాలీని నిర్వహించారు. భీమడోలు సాయిబాబా ఆలయం వద్ద సీనియర్ పిరిమిడ్ మాస్టార్లు వరలక్ష్మి, గోవిందయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఫ్లకార్డులను చేత పట్టుకుని మానవుల ఆహారం శాఖాహారమని, శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని నినాదాలు చేశారు. పలు కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి, గోవిందయ్య మాట్లాడుతూ ఈనెల 11న ప్రతీజీ జయంతిని పురస్కరించుకుని అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పిన్నింటి అప్పారావు, పంట్ల రాము, అనుపోజు రంగారావు, ఈడే గిరిబాబు, ఈతకోట సుబ్బారావు పాల్గొన్నారు.

ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

బుట్టాయగూడెం: అమర వీరుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నాగన్నగూడెంలో అమరుడు నాగన్న, గంగిరెడ్డిల స్థూపం వద్ద కుర్సం లత అధ్యక్షతన ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, అటవీశాఖామంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల అడవులను విస్తరిస్తామని ప్రకటన చేశారని, ఆ ప్రకటనలో ఆదివాసీ భూములను కలుపుకుని వారిని అడవుల నుంచి గెంటివేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ప్రధానంగా గోదావరీ పరీవాహక ప్రాంతాల్లో ఆదివాసీలు లక్షల ఎకరాల్లో పోడు కొట్టుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. పాలకవర్గాల వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి, బాబులురెడ్డి, పండురెడ్డి, శ్రీరామ్‌మూర్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భుక్తిపోరులో ప్రమాద ఘంటికలు

- లింగయ్య చెరువు మలుపులో వాహనాలకు అడ్డుపడి నిమ్మ, జామకాయల విక్రయం
- బెంబేలెత్తుతున్న వాహనదారులు, భక్తులు


రోడ్డు మధ్యలో వాహనాలకు అడ్డుపడుతున్న జామ, నిమ్మ కాయల వ్యాపారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి వివిధ వాహనాలపై వచ్చే భక్తులకు తిరుగు ప్రయాణంలో కొందరు వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. నిమ్మ, జామ కాయలు కొనాలంటూ అడ్డుపడి మరీ.. వారి వాహనాలను రోడ్లపై నిలిపివేస్తున్నారు. దీని కారణంగా వెనుక వచ్చే వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో సాక్షాత్తు ఒక హైకోర్టు న్యాయమూర్తి వాహనానికి ఇదేవిధంగా అడ్డుపడగా, అప్పట్లో ఆలయ అధికారులను ఆయన హెచ్చరించారు. అయినా సమస్య తీరకపోగా, రోజురోజుకు జటిలమవుతోంది. వివరాల్లోకి వెళితే.. కొండ దిగువన లింగయ్య చెరువు గట్టు మలుపులో కొందరు వ్యాపారులు కొన్నాళ్లుగా నిమ్మ, జామకాయలను విక్రయిస్తున్నారు. శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణమైన భక్తుల వాహనాలకు అడ్డుపడి మరీ, నిలిపివేస్తున్నారు. నిమ్మ, జామకాయల కవర్లు కొనాలంటూ వాహనాలను కదలనివ్వడం లేదు. ఆ సమయంలో వెనుక వచ్చే వాహనాలు సైతం రోడ్లపై నిలిచిపోతున్నాయి. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.

మోగుతున్న ప్రమాద ఘంటికలు..

కొండపై నుంచి దిగువకు వెళ్లేటప్పుడు రోడ్డు పల్లం కావడంతో వాహనాలు వేగంగా వెళుతున్నాయి. ఆ సమయంలో వ్యాపారులు పోటీ పడి మరీ లింగయ్య చెరువు మలుపులో వాహనాలకు అడ్డుపడుతున్నారు. దాంతో డ్రైవర్లు సడన్‌గా వాహనాలను రోడ్డు మధ్యలో నిలుపుదల చేస్తున్నారు. ఆ సమయంలో వెనుక వచ్చే వాహనదారులు, ముందు ఆగిన వాహనాలను తప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని భక్తులు, వాహనదారులు భీతిల్లుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	03

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	14
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	56	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44-56	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	52
కాకర కాయలు	36-44	కీరా దోస	36
బీరకాయలు	32-36	ఫ్రెంచ్‌బీన్స్	140
బీరకాయలు (పందిరి)	36	అల్లం	75
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	52-66	పాలకూర	15
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,56	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	32-48	బఠాణీ	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	120
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48